# అభివృద్ధిలో తెలంగాణ నంబర్‌వన్

- విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో చేరిన గట్టికల్‌కు చెందిన 60 దళిత కుటుంబాలు

ఆత్మకూర్.ఎస్ : సూర్యాపేట నియోజకవర్గంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీలోకి వలసల జోరు కొనసాగుతున్నది. దళితబంధు పథకంతో తమను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు సామాజిక గౌరవానికి భరోసా కల్పించిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోనే తామంతా అంటూ ఆత్మకూర్.ఎస్ మండలం గట్టికల్ గ్రామానికి చెందిన 60 కాంగ్రెస్ పార్టీ దళిత కుటుంబాలతోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గురువారం హైదరాబాద్‌లో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ నంబర్‌వన్ స్థానంలో నిలిచిందన్నారు. దళితుల ఆర్థికాభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం దేశంలో మరెక్కడా లేదన్నారు. ఏ పార్టీతో తమ బతుకులు బాగుపడ్డాయో ప్రజలు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2014లో బీఆర్‌ఎస్‌కు వేసిన ఓటు రూ.7,500 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. సూర్యాపేటలో జరిగిన అభివృద్ధి కేవలం ఆరంభం మాత్రమేనని, ఇంకా చేయాల్సింది చాలా ఉందని మంత్రి తెలిపారు. పార్టీలకతీతంగా రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్‌కు అండగా ఉండి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన చేరికల్లో బచ్చలకూరి సతీశ్, ఇరుగు నవీన్, బచ్చలకూరి కరుణాకర్, బచ్చలకూరి అరవింద్, గుర్రాల రాంబాబుతోపాటు దళిత కుటుంబాలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# బీఆర్‌ఎస్‌ను మూడోసారి ఆశీర్వదించాలి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- కురుమర్తి నుంచి కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరిక



గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్, అక్టోబర్ 12 : అభివృద్ధిని కాంక్షిస్తూ వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కట్టంగూర్ మండలం కురుమర్తి గ్రామం నుంచి 100 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం నకిరేకల్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారందరినీ ఎమ్మెల్యే పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ప్రజలు ఆశీర్వదించి మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలని కంకణం కట్టుకోవాలని చెప్పారు. తనను తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో ఊట్కూరి మహేశ్, ఇంద్రకంటి రమేశ్, శేఖర్, కొంపెల్లి శంభయ్య, గడగోజు నర్సింహాచారి, ఇంద్రకంటి వీరవెంకటయ్య, చెనగోని అర్వపెల్లి, చెనగోని యాదయ్య, గాదరి పిచ్చయ్య, ముత్తయ్య, దార రమేశ్, అనంతుల నర్సింహ, సైదులు, పెద్ద భిక్షం, వెంకయ్య, కుంచం లింగయ్య ఉన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే ప్రజా సంక్షేమం

- నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- కాంగ్రెస్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరిక



కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ సిటీ, అక్టోబర్ 12 : సీఎం కేసీఆర్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని నమ్మి కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కనగల్ మండలం రేగట్టెకు చెందిన కాంగ్రెస్ నాయకులు సిరిగిమల్ల వెంకటరమణ, భోగరాజు నవీన్, సతీశ్, సిరిగిమల్ల శ్రీధర్, ఓగరాజు అంజయ్య, సిరిగిమల్ల మల్లేశ్, బొమ్మపల్లి సైదులు తదితరులు నల్లగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల సంక్షేమం కోసమే బీఆర్‌ఎస్ పని చేస్తుందన్నారు. ప్రజలు కోరుకునే విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నట్లు తెలిపారు. ఎంపీపీ కరీంపాషా, ఎంపీటీసీ పాలకూరి పుష్ప, సింగిల్ విండో చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, సర్పంచ్ కృష్ణయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు యాదయ్య పాల్గొన్నారు.

## దసరా సెలవులొచ్చేశాయ్..



నల్లగొండ బస్టాండ్‌లో బస్సు వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల రద్దీ





నల్లగొండలో ఇంటిబాట పట్టిన విద్యార్థులు, బస్సు ఎక్కుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శుక్రవారం నుంచి ఈ నెల 25 వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ నెల 26న పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నట్లు పేర్కొన్నారు. సెలవుల్లో పాఠశాలలు నిర్వహించవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పదని హెచ్చరించారు. పాఠశాలలకు సెలవుల ప్రకటనతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు. హాస్టళ్లలో ఉండి చదివే తమ పిల్లలను తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులతోపాటు విద్యార్థులతో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ రద్దీగా మారింది. ప్రయాణికులతో బస్సులన్నీ కిక్కిరిశాయి.

– నల్లగొండ సిటీ/ నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్

# గుట్టలో శాస్త్రోక్తంగా నిత్యారాధనలు



యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహుడి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్లకు నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. గురువారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం నిర్వహించారు. నిజరూప దర్శనంలో నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణతంతును వీక్షించారు. ప్రధానాలయ ముఖమండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చనలు జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 5 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.10,84,613 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ గీత తెలిపారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



నేరేడుచర్లలో వివిధ పార్టీల నాయకులకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

# అభివృద్ధికి మద్దతుగా బీఆర్‌ఎస్‌లో చేరికలు

- హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి
- నేరేడుచర్లకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరిక

నేరేడుచర్ల, అక్టోబర్12 : సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి మద్దతుగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో పెద్దఎత్తున చేరుతున్నట్లు హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డులకు చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు కొణతం సత్యనారాయణరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సైదిరెడి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే ఎంతో అభివృద్ధి జరిగిందని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సురేశ్‌బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగేండ్ల శ్రీధర్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మార్కండేయ, కౌన్సిలర్లు బాషా, నాగవేణి నారాయణ, సులోచన, లలిత, సాయి, సరితాసైదిరెడ్డి, షహనాజ్, మహిళా విభాగం పట్టణాధ్యక్షురాలు కట్టా కళావతి, నాయకులు వల్లంశెట్ల రమేశ్‌బాబు, రాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.